ప్రజాశక్తి

ఆదివారం 9 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నిర్వాసితుల ఉపాధి వెతలు

- పనులు ఆపేసిన రుషిల్ యాజమాన్యం
- రోడ్డున పడ్డ కళాసీలు
- సిఐటియు ఆధ్వర్యాన కొనసాగుతున్న పోరాటం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అచ్యుతాపురం మండలం, దిబ్బపాలేనికి చెందిన ఇతని పేరు గొర్లె సత్తిబాబు. సెజ్‌లో భూములు పోకముందు తన ఐదెకరాల పొలంలో అవసరమైన రోజుల్లో కూలీలను పెట్టుకొని కుటుంబ సభ్యులతో వ్యవసాయం చేసేవాడు. 2004లో సెజ్‌లో భూములు పోవడంతో కూలీగా మారాడు. ప్రస్తుతం రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీలో ముఠా కళాసీగా పనిచేస్తున్నాడు. కంపెనీలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు యంత్రాలు పెట్టకముందు రోజుకు ఐదు వందల రూపాయలు వచ్చే కూలి, నేడు ఒక్కో రోజు వంద రూపాయలు కూడా రావడంలేదు.

ఇతను గొర్లె ఎరుకునాయుడు. మూడున్నరెకరాల రైతు. వరి, కూరగాయలు, గంటెలు పండించుకొని బతికేవారు. భూములు సెజ్‌లో పోవడంతో రుషిల్ కంపెనీలో కళాసీగా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాలకు అప్పులుచేసుకొని కాలం వెళ్లదీస్తున్నాడు.

అంది అప్పలనాయుడుకు ముగ్గురు మగ పిల్లలు. ఎకరా భూమి సెజ్‌లో పోయింది. కూలి పనులు చేసుకొని పిల్లలను చదివించాడు. పరిశ్రమల్లో తమ పిల్లలకు ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డాడు. ఇద్దరు పిల్లలను ఐటిఐ చదివించాడు. పరిశ్రమలకు ఉపాధి కోసం దరఖాస్తు చేయించాడు. ఏ కంపెనీలోనూ ఉద్యోగం పిల్లలకు ఇవ్వలేదు. ఐటిఐ పూర్తిచేసిన హరీష్ చదువుతో సంబంధంలేని పని కామంత్‌గిరి కంపెనీలో చేస్తున్నాడు. మరో అబ్బాయి సురేష్‌కు పని కోసం అవస్థలుపడుతున్నాడు. బతుకుదెరువులేక అప్పలనాయుడు రుషిల్ కంపెనీలో కళాసీగా పనిచేస్తున్నాడు.

ఇలా సెజ్‌లో భూములు కోల్పోయిన దిబ్బపాలేనికి చెందిన 94 మంది రైతులు 2019 నుంచి రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీలో ముఠా కళాసీలుగా పనిచేస్తున్నారు. తమ భూముల్లో వ్యవసాయం చేసుకొని బతికే

వంటా వార్పుతో కార్మికుల నిరసన (ఫైల్)

వీరంతా, ఇప్పుడు తమ భూముల్లోని కంపెనీల్లో కళాసీలుగా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆనాడు ఎకరాకు ప్రభుత్వం చెల్లించిన రూ.2.90 లక్షలు ఇళ్లు కట్టుకోవడానికి, ఇతర కుటుంబ అవసరాలకు ఖర్చయ్యాయి. నేడు అటు భూముల్లేక, ఇటు డబ్బుల్లేక కుటుంబ పోషణకు కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి వారికి ఏర్పడింది. రుషిల్ కంపెనీలో కలప లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వీరంతా చేసేవారు. వీరు చేసిన పనులను నేడు యంత్రాలతో చేయించడంతో రోజువారి కూలి తగ్గింది. గేదెలు, ఆవులు పెంచుకొని బతుకుదామంటే చుట్టూ పరిశ్రమలురావడం, ప్రభుత్వ స్థలాలు ఒడడంతో పశువులను మేపుకొనే అవకాశంలేకుండా పోయింది. అనివార్యంగా కంపెనీల్లో చిన్నచిన్న

మిగతా 2లో..

కంచరపాలెంలో వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ఘనంగా బొట్టా నర్సింగరావు వర్ధంతి

పలుచోట్ల సభలు, సేవా కార్యక్రమాలు

వార్తలు 4లో..

బెయిల్‌పై ఉన్న వ్యక్తి.. రాష్ట్ర భవిష్యత్తా..

- హామీల అమల్లో జగన్ ప్రభుత్వం విఫలం
- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు అనిత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 16 నెలలు జైల్లో ఉండి, మూడున్నరేళ్లుగా బెయిల్‌పై ఉన్న వ్యక్తి ఎపికి భవిష్యత్తు ఎలా అవుతారని సిఎం జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత

మిగతా 2లో..

గంజాయి నిందితుడు పరార్

వార్త 3లో..

రూ.కోట్లు వ్యయం.. ఏదీ ప్రయోజనం?

వార్త 3లో..

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

వార్త 8లో..

చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిఆర్ఎస్ విశాఖ జిల్లా నేతలు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడి తీరుతాం

బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్

వార్త మెయిన్‌లో..

కొత్త పోలీసు బాసులు

- విశాఖ పోలీసు కమిషనర్‌గా త్రివిక్రమ్ వర్మ
- లా అండ్ ఆర్డర్ డిసిపిగా వాసన్ విద్యాసాగర్ నాయుడు
- అనకాపల్లి ఎస్‌పిగా కెవి.మురళీకృష్ణ
- అల్లూరి జిల్లా ఎస్‌పిగా తుహిన్ సిన్హా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉమ్మడి విశాఖ జిల్లాలో పలువురు పోలీసాధికారులు శుక్రవారం రాత్రి బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారు నియమితులయ్యారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా సంవత్సర కాలంగా సేవలు అందిస్తున్న 2002 బ్యాచ్‌కి చెందిన సిహెచ్.శ్రీకాంత్‌ను ఐజిగా సిఐడి విభాగానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు రేంజ్ ఐజిగా పనిచేస్తున్న 2005 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన సిఎం త్రివిక్రమ్ వర్మను నియమించారు. విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపిగా

పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

అనకాపల్లి ఎస్‌పి మురళీకృష్ణ

పనిచేస్తున్న 2017 బ్యాచ్‌కు చెందిన సుమిత్ గరుడ సునీల్‌ను ఎస్‌పిగా ఎస్ఐబి విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో 2016 బ్యాచ్‌కి చెందిన వాసన్ విద్యాసాగర్ నాయుడును విశాఖపట్నం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నిర్వాసితుల ఉపాధి వెతలు

కూలి పనులు చేసుకొని బతుకువెళ్లదీస్తున్నారు.

కొద్ది రోజుల క్రితం వరకూ అన్‌లోడ్ చేసేందుకు లారీకి రూ.500, వ్యాన్‌కు రూ.300, ట్రాక్టర్‌కు రూ.200 ఇచ్చేవారు. కూలి గిట్టుబాటుకాకపోయినా, వచ్చిన కూలితో కుటుంబాలను పోషించుకుంటున్న నిర్వాసిత ముఠా కార్మికులను ఫిబ్రవరి 28 నుంచి కంపెనీ ఆపేసింది. లోడింగ్, అన్‌లోడింగ్ పనులు గతంవలె కల్పించాలని యాజమాన్యంతో కళాసీలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పని కల్పించలేదు. యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో శ్రీ రామ కళాసీల సంక్షేమ సంఘం (సిఐటియు) నేతృత్వంలో ఆందోళన చేపడుతున్నారు. నాలుగు రోజులుగా రుషిల్ డెకార్ కంపెనీ వద్ద వంటా వార్పు నిర్వహించి పోరాటం కొనసాగిస్తున్నారు. పరిశ్రమల్లో స్థానిక నిర్వాసితులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న నిబంధనగానీ, 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్న జిఒగానీ కంపెనీల్లో అమలుకావడంలేదు. అర్హత కలిగిన స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువతను తక్కువ వేతనాలతో యాజమాన్యాలు పనిచేయించుకొని నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయి. పనుల్లేక వీధిన పడ్డ ముఠా కళాసీలు పాత పద్ధతిలో పని కల్పించాలని కోరుతున్నా, ప్రభుత్వ యంత్రాంగం జోక్యంచేసుకొని పని కల్పించే చర్యలు చేపట్టడంలేదు.

నిర్వాసిత ముఠా కళాసీలకు పనులు కల్పించాలి

భూములు కోల్పోయిన నిర్వాసిత ముఠా కళాసీలకు తక్షణమే పనులు కల్పించాలి. రాజకీయ జోక్యంలేకుండా వారికి నిరంతరం పని వుండేలా యాజమాన్యం చూడాలి. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలి. కళాసీలకు పని కల్పించే చర్యలు చేపట్టకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

జి.కోటేశ్వరరావు,
సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

కొత్త పోలీసు బాసులు

నగర లా అండ్ ఆర్డర్ డిసిపిగా నియమించారు.

అదే విధంగా అనకాపల్లి ఎస్‌పిగా పనిచేస్తున్న 2017 బ్యాచ్‌కి చెందిన గౌతమి శాలిని విశాఖపట్నం ఎపిఎస్‌పి 16 బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో కెవి.మురళీకృష్ణను అనకాపల్లి ఎస్‌పిగా నియమించారు. వీరితో పాటు అల్లూరి జిల్లా రంపచోడవరం అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న 2012 బ్యాచ్‌కి చెందిన జి.కృష్ణకాంత్‌ను కర్నూలు ఎస్‌పిగా బదిలీ చేశారు. ఆయనతోపాటు అల్లూరు జిల్లా పాడేరు అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న 2017 బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హాను అల్లూరి జిల్లా ఎస్‌పిగా నియమించారు.

మాట్లాడుతున్న అనిత

బెయిల్‌పై ఉన్న వ్యక్తి.. రాష్ట్ర భవిష్యత్తా..

విమర్శలు గుప్పించారు. వైసిపి ప్రభుత్వ తప్పుడు విధానాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని తేల్చిచెప్పారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంచులేసుకుని తిరిగే భజన బృందాన్ని చూసానని, వీరు జగనన్నే మా భవిష్యత్తు అన్న స్టిక్కర్లు అంటిస్తున్నారని తెలిపారు. మద్య నిషేధం కాస్త మద్య నియంత్రణగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రమాణ స్వీకారం రోజునే విద్యుత్ ఛార్జీలు తగ్గించేస్తానని ప్రగల్భాలు పలికి, ఆరు నెలలకే విద్యుత్ ఛార్జీలు పెంచేసి ప్రజలను జగన్ నయవంచనకు గురి చేశారన్నారు. మూడున్నరేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేయాలన్న ఉపాధ్యాయులపై ఉక్కుపాదం మోపారన్నారు. వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించారన్నారు. 45 సంవత్సరాలు దాటిన వారికి రూ.3 వేలు పింఛన్ ఇస్తామని జగన్ చెప్పలేదా ? అని అనిత ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, మెట్రోరైల్ ప్రాజెక్టు సంగతిని మరిచారన్నారు. టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 'జగన్ మా భవిష్యత్తు కాదు.. మా దరిద్రం' అని ప్రజలు అనుకుంటున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి, కేదారి లక్ష్మి, ఈతలపాక సుజాత, కురిమిల లీలావతి, ఉమారాణి, తోట శ్రీదేవి, ఉమా పాల్గొన్నారు.

జిఒ 52ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - చింతూరు : బోయ, వాల్మీకి, బొంతు, ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో కలపడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 52ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదివాసీ మహాసభ, ఆదివాసీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రాలో కలిపిన గ్రామాలన్నింటికీ ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎపి పంచాయతీరాజ్ చట్టం ప్రకారంగా ఏప్రిల్ 14న జరుగు గ్రామసభల్లో పోలవరం ముంపు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, జిఒ 52ను రద్దు చేయాలని, జిఒ3ను పునరుద్ధరించాలని కోరుతూ తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ మహాసభ లీగల్ అడ్వైజర్ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల సొమ్ముతో పనులన్నీ ఒకే వైపు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : మొన్న మోడీ పర్యటన.. నిన్న గ్లోబల్ సమ్మిట్.. తాజాగా జి -20 వర్కింగ్ గ్రూప్ సమావేశాలు.. పేర్లు ఏవైనా నగర ప్రజల మూలుగులు పీల్చి వసూలు చేసిన రూ.కోట్ల డబ్బును దారి మళ్లించేసి... పనులన్నీ ఒకే వైపు రోడ్లపై కుమ్మరించి నగర పాలనను జివిఎంసి పాలకవర్గం, అధికారులు గాడి తప్పించేశారు

ప్రచార మోజులో పడి..

వచ్చి పోయేవారికి విశాఖ గొప్ప అందమైనదని ప్రచారం చేయడమే జివిఎంసి పాలకుల విధానంగా కనిపిస్తోంది. వైసిపి పాలకవర్గం వచ్చాక విశాఖ నగరంలో సుమారు రూ.160 కోట్ల వరకూ పనులు జరిగి భారీ అవినీతి జరిగిందన్న విమర్శలు కూడా సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.. పలువురు నాయకులు ఈ కాంట్రాక్టులను లోపాయికారీగా దక్కించుకున్నారన్న చర్చ జరుగుతోంది. విశాఖకు రాజధాని రాలేదని 'టూ ఇన్ వన్' మాదిరిగా అటు సదస్సులు, ఇటు తమ అధినేత కోరుకునే ఏరియాలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటూ సంతృప్తి పడే వైసిపి శ్రేణులూ ప్రస్తుతం కనిపిస్తున్నాయి.

పెట్టుబడులు వచ్చేది ఇలాగేనా ?

ఇంతకీ ప్రభుత్వం లక్ష్యం ఏమిటి ? టూరిస్టులను అకర్షించి నాలుగు డబ్బులు సంపాదించడం, కొత్త పరిశ్రమలు వస్తాయంటూ భ్రమపెట్టడమేనా అన్న చర్చ కూడా జరుగుతోంది. పైన చెప్పిన కార్యక్రమాలకు జివిఎంసి అంతలా సాగిల పడి నిధులను ఇష్టరాజ్యంగా ఖర్చు చేయాల్సిన పని లేదు. ఏకంగా రూ.160 కోట్లు ఖర్చు చేయగా, ఆ మొత్తమంతా విశాఖ ప్రజలు ఆస్తి పన్ను, చెత్త పన్ను చెల్లించగా వచ్చినవేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ ప్రజాధనాన్ని ఈ ఈవెంట్ల కోసం నేడు దారి మళ్లించారు. రోడ్లపై చెట్లకు రంగులు, రాయీ రప్పకు మెరుగులు

దిద్దడం, సాగర తీరంలో కనిపించే ప్రతి వస్తువుకూ రంగు వేసేసి కోట్లు రూపాయలు వెదజల్లారు. ఇదేమంటే ? పెట్టుబడులు వస్తాయంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలు వైసిపి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అధికార పార్టీ కార్పొరేటర్లు విపరీత ప్రచారం చేసి నగర జీవులను మభ్యపెడుతున్నారు. విశాఖపట్నం భౌగోళిక స్వరూపంలోనే పరిశ్రమల ఏర్పాటు అంతర్గతంగా ఇమిడి ఉంది.. దీనికోసం ప్రత్యేకంగా ప్రచార అర్భాటం అవసరం లేదు. మోడీ ప్రైవేటుపరం చేస్తానంటున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటే చాలు. దాన్ని వదిలేసి కొత్త పరిశ్రమల పేరిట వైసిపి చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు నడి బజారులో బేరానికి పెట్టిందని, ఆ కుట్రలను సాగనివ్వకుండా చేస్తే విశాఖపట్నాన్ని కాపాడుకోగలమని సిపిఎం వంటి వామపక్షాలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ మేధావులు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు.. ఇవేవీ రాష్ట్ర, కేంద్ర పాలకుల చెవులకు ఎక్కడం లేదు. పైగా మోడీ రాక కోసం, అలాగే జి 20 సమావేశాలు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ల కోసం కోట్ల రూపాయలను కేవలం సాగర తీరంలో అభివృద్ధి పనుల పేరిట పోసేయడం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ఉపయోగపడింది తప్ప నగరంలోని ప్రజలకు ఏమాత్రమూ ప్రయోజనం చేకూర్చలేదు. మరోవైపు గ్లోబల్ సమ్మిట్లకు, జి 20 సమావేశాలకు కేంద్రం ఒక్క రూపాయినీ విదల్చలేదు. నిధులు ఇస్తామన్న కాషాయ నేతల మాటలు ఉత్తివేనని తేలిపోయాయి.

అటు కన్నెత్తి చూడడం లేదు

ఇక జివిఎంసిలో వందల సంఖ్యలో మురికి వాడలున్నా సరే ఒక్క రూపాయినీ ఆ ప్రాంతంలో జివిఎంసి వెచ్చించడం లేదు. నాయకులు, స్థానిక కార్పొరేటర్లు, అధికారుల హడావుడి తప్ప మురికి వాడల్లో సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. కొండవాలు ప్రాంతాల్లో జనం బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. వానొచ్చినా, వరదొచ్చినా కష్టాలు పడుతూనే ఉన్నారు.

సదస్సుల పేరిట దోపిడీ

కలెక్టరేట్ : పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన కోట్ల రూపాయలను సమ్మిట్ల పేరుతో పూర్వ కమిషనర్ రాజాబాబు దోచుకున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జి - 20 సదస్సు పేరుతో ప్రజాధనం ఎలా వృథా అయిందో తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE CONSUMER REDRESSAL FORUM-II VISAKHAPATNAM
C.C.No. 22 / 2023

Between:
Vaddi Muralidhar ... Complainant
And:
Holiday Factory Private Limited ... Respondent

To,
Holiday Factory Private Limited
3rd Floor, Chitralaya,
Jagadamba Center
Visakhapatnam.

Please take summons that the above case filed against you and the above case stands posted to **11-04-2023.**

You are hereby summoned to appear either in person or through an advocate in the above mentioned Honourable Court at **10.30 A.M. on 11-04-2023.**

(By Order of the Court)
V.MURALIDHAR
Complaintant, Visakhapatnam.
Visakhapatnam.
Dt. 8-4-2023

IN THE HONOURABLE COURT OF THE CONSUMER REDRESSAL FORUM-II VISAKHAPATNAM
C.C.No. 20 / 2023

Between:
K.Kasi Visweswara Rao ... Complainant
And:
Holiday Factory Private Limited ... Respondent

To,
Holiday Factory Private Limited
3rd Floor, Chitralaya,
Jagadamba Center
Visakhapatnam.

Please take summons that the above case filed against you and the above case stands posted to **12-04-2023.**

You are hereby summoned to appear either in person or through an advocate in the above mentioned Honourable Court at **10.30 A.M. on 12-04-2023.**

(By Order of the Court)
K.KASI VISWESWARA RAO
Complaintant, Visakhapatnam.
Visakhapatnam.
Dt. 8-4-2023

జనరల్ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా పేరు ముక్కవల్లి @ **కాకాని సౌజన్యవతి** భర్త కాకాని శ్రీనివాసరావు, విశాఖపట్నం, సాగర్‌నగర్‌లోని నివసిస్తూ యున్నాను. తేది: 10-10-2022న సాగర్‌నగర్ నుండి వెంకోజీపాలెం ఆటోలో వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెంబర్ **K6573868**ను పొగొట్టు కున్నాను. ఈ విషయమై ఆరిలోవ, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసియున్నాను. ఆ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ఆదేశానుసారం ఈ ప్రకటన వేస్తుయున్నాను. పైన పేర్కొన పాస్‌పోర్టు ఎవరికైన దొరికినచో నా యొక్క **సెల్‌నెం.9110583472**ను సంప్రదించి గాని లేదా ఆరిలోవ, పోలీస్ స్టేషన్‌కు గాని అందజేయ వలయును.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.780/2020

Between :
State Bank of India, SME Centre,
Maharanipeta,Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff
And:
Sunkara Pydi Raju ...Defendant

SUMMONS

To,
The Defendant :
Sunkara Pydi Raju,
S/o. Adinarayana,
Hindu, aged 44 years,
R/at D.No.1-92,
Mutyamamba Colony, Vepagunta,
Visakhapatnam-530047.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of loan amount with subsequent interest and costs and other reliefs. You are hereby summoned to appear in the above Court in person or through a Pleader duly instructed, and the matter stands posted to **01-05-2023** at **10:30 A.M** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

(By Order of the Hon'ble Court)
Smt. **L.V. RAMANI,**
Advocate, Visakhapatnam.
Cell: 9491331924.

మహారాజశ్రీ విజయనగరం మోటారు ఏక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు 4వ అదనపు జిల్లా జడ్జి (ఎస్సి,ఎస్టి) వారి కోర్టు, విజయనగరం

ఎం.వి.ఓ.పి.నెం.165/2022

బిట్వీన్ :
గూడెపు సత్యం.................. పిటీషనర్
మరియు
కరణం అచ్చిబాబు మరియు వగైరాలు..................రెస్పాండెంట్స్
1వ రెస్పాండెంట్ వివరం:
కరణం అచ్చిబాబు, తండ్రి (లేటు) గణపతిరావు.
హిందు, వయస్సు 42 సం॥లు,
నివాసం, డోర్ నెం. 13-232-1, ఇందిరనగర్,
గోపాలపట్నం, విశాఖపట్నం సిటి మరియు జిల్లా.
డ్రైవర్ ఆఫ్ మేక్సికేబ్ బేరింగ్ నెం. ఏపి 16 టిబి 2708
2వ రెస్పాండెంట్ వివరం.
బొద్దేటి అప్పలరాజు తండ్రి/లక్ష్మణరావు
హిందు, వయస్సు 50 సం॥లు. నివాసం. ఇందిరనగర్, గోపాలపట్నం. విశాఖపట్నం సిటి మరియు జిల్లా, ఓనర్ ఆఫ్ మేక్సికేబ్ బేరింగ్ నెం. ఏపి 16 టిబి 2708.

నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనరు రెస్పాండెంట్స్‌పై ఇన్సూరెన్స్ నష్టపరిహారం ఇప్పించవలసినదిగా కోర్టులో దాఖలు చేసిన కేసులో 1వ మరియు 2వ రెస్పాండెంట్స్‌కు నోటీసు అమలు జరగనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా 1వ మరియు 2వ రెస్పాండెంట్స్ కేసు వాయిదా నిమిత్తం కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన వేయబడినది. సదరు కేసు తేది 13.04.2023న వాయిదా అయి ఉన్నది. కావున 1వ మరియు 2వ రెస్పాండెంట్స్ స్వయముగా గాని, వారి తరుపున న్యాయవాది ద్వారా గాని పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరు కావలసియున్నది. లేని యెడల కోర్టువారు పైన పేర్కొనబడిన 1వ మరియు 2వ రెస్పాండెంట్స్‌పై పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.

కరణం సూర్యతేజ్
పిటిషనర్ తరుపు న్యాయవాది,
తోటపాలెం, విజయనగరం
విజయనగరం.
తేది.09.04.2023

మహారాజశ్రీ విజయనగరం మోటారు ఏక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ మరియు 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు::విజయనగరం

ఎం.వి.ఓ.పి.నెం.156/2022

బిట్వీన్ :
బమ్మిడి రామసత్యం ....పిటిషనర్
మరియు
నిద్రబంగి మహాలక్ష్మణ్ మరియు ఇతరులు..... రెస్పాండెంట్స్
2వ రెస్పాండెంట్ వివరం:
జె. గురుమూర్తి, తండ్రి/రాము
రెసిడెంట్ ఆఫ్ డోర్.నెం.4-74, జీరుపేట, ఓనర్ ఆఫ్ ది ఆటో రిక్షా, బేరింగ్ నెం.AP 31 TH 4795,
భీమిలి, విశాఖపట్నం.

నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనరు రెస్పాండెంట్స్‌పై ఇన్సూరెన్స్ నష్టపరిహారం ఇప్పించవలసినదిగా కోర్టులో దాఖలు చేసిన కేసులో 2వ రెస్పాండెంటుకు నోటీసు అమలు జరగనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా రెండవ రెస్పాండెంటు కేసు వాయిదా నిమిత్తం కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన వేయబడినది. సదరు కేసు తేది 19.04.2023న వాయిదా అయి ఉన్నది. కావున 2వ రెస్పాండెంటు అయిన జె.గురుమూర్తి స్వయముగా గాని, వారి తరపున న్యాయవాది ద్వారా గాని పై తేదిన ఉదయం 10.30 ని॥లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరు కావలసియున్నది. లేని యెడల కోర్టువారు పైన పేర్కొనబడిన 2వ రెస్పాండెంట్‌పై పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.

కరణం సూర్యతేజ్
పిటిషనరు తరపు న్యాయవాది
తోటపాలెం, విజయనగరం.
మొబైల్ నెం. 9440108023
విజయనగరం.
తేది.09.04.2023

రూ.కోట్లు వ్యయం.. ఏదీ ప్రయోజనం?

పనులు సాగక కళా విహీనంగా ఉన్న పార్కు

ఐదేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా నేటికీ పూర్తికాని వైనం

ప్రజాశక్తి -మధురవాడ : ప్రజా ధనం రూ. కోట్లలో వెచ్చించి నిర్మాణం చేపట్టిన పార్కుకు ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే దర్శనమిస్తూ ప్రజలకు ఉపయోగకరంగా లేకపోయింది. జీవీఎంసీ 7వ వార్డు పరిధి మధురవాడ స్వతంత్రనగర్ కాలనీలో రూ.2.70 కోట్లతో అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు భూమిపూజా చేసి పార్కు నిర్మాణ పనులు చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు ఐదేళ్ల కిందట ఈ పనులకు శంకుస్థాపనచేసినా నేటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. సుమారు 5 ఎకరాల సువిశాలమైన స్థలంలో ఈ పార్కు పనులను జీవీఎంసీ అప్పట్లో మొదలు పెట్టింది. ఈ పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అసంపూర్ణంగా నిర్మించి నిరుపయోగంగా వదిలేయడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. గ్యాలరీ, వాకింగ్‌ట్రాక్, యోగ గది, ఓపెన్ జిమ్, వాలీబాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టుపాటు మహిళలకు పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు తదితర నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణం మొదలుపెట్టే సమయంలో సంవత్సర కాలంలో స్వతంత్రనగర్ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పినా నేటికీ అందుబాటులోకి రాలేదు.

పార్కు పచ్చదనంతో కళకళలాడేందుకు ఉద్యానశాఖ సహకారంతో వివిధ రకాల పూలమొక్కలు, పచ్చికబయళ్లు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. పార్కులో ఏ మూలన కూర్చున్నా మైల్డ్ మ్యూజిక్ వినిపించేలా లౌడ్ స్పీకర్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణా లోపం, స్థానిక రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వల్ల నత్తనడకన సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పార్కును పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

పార్కు నిర్మాణ సమస్య తన దృష్టికి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవిఎంసి కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పార్కు అభివృద్ధికి కృషిచేస్తాను.

పిళ్ళా మంగమ్మ
కార్పొరేటర్

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితుడు పరార్

పట్టుబడిన గంజాయి నిందితులు, వీరిలో ఒకరు పరారయ్యారు

ప్రజాశక్తి-సీతమ్మధార : గంజాయి కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఒకరు చేతికి ఉన్న బేడీలతోనే పోలీస్ స్టేషన్ నుంచి పరారైపోయిన ఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఇద్దరు యువకులు నాలుగు కిలోల లిక్విడ్ గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి గురువారం పట్టుకున్నారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చిన్న పాచిల గ్రామానికి చెందిన పప్పు నూకరాజు (27), చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సియాదుల సత్తిబాబు (24)ను అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వీరిద్దరికీ కలిపి పోలీసులు బేడీలు వేసి స్టేషన్‌లో కూర్చోబెట్టారు. వారిలో సత్తిబాబు మరుగుదొడ్డికి వెళ్లాలని చెప్పి నూకరాజు చేతితో కలిపి ఉన్న లింక్‌ను లాగేసి పరారయ్యాడు. స్థానికులు గమనించి సత్తిబాబును పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారినీ వదిలించుకుని పారిపోయాడు. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆసరా చెక్కును అందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున

స్వతంత్రనగర్‌లో 'ఆసరా' పంపిణీ

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్ కాలనీలో శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున 3వ విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం కాలనీలోని లక్ష్మీదేవి ఆలయం నుంచి వరదనీటి కాలువ నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.19.98 లక్షలతో వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముత్తంశెట్టి మాట్లాడుతూ, జగనన్నతోనే స్వరాజ్యం సాధ్యమయ్యేలా పాలన సాగుతుందన్నారు. చట్ట సభల్లో, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని తెలిపారు. అనంతరం 5, 6, 7, 8 వార్డుల్లో ఉన్న స్వయం సహాయక సంఘాలలో 13,935 మంది లబ్ధిదారులకు రూ.10.62 కోట్లు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో జట్లమ్మ తల్లి పండగపై వివాదం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామ దేవత జట్లమ్మ తల్లి పండగపై రాజకీయ గ్రహణం అలుముకుంది. పండగకు చాటింపు వేయడంపై మరో వర్గం అడ్డుకుంది. మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, మాజీ సర్పంచ్ ఆర్.సన్యాసిరాజులు సమక్షంలో పురోహితులు ఈ నెల 8 నుంచి మే 2వ తేదీ వరకు పండగ నిర్వహించడానికి నిర్ణయించారు. గ్రామస్తులతో సమావేశం పెట్టకుండా పండగ నిర్ణయించడం సరికాదని కొంతమంది వ్యతిరేకించారు. గ్రామ సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎంపిటిసి సభ్యులు పి.నారాయణమ్మను సంప్రదించకుండా పండగను నిర్ణయించడంపై వ్యతిరేకత పెరిగింది. పండగ చాటింపు ప్రకారం శనివారం సిరిమాను ఉత్సవం నిర్వహించాల్సి ఉండగా దానికి అడ్డుకట్టు పడింది. చందక వారి కళ్లాల వద్ద ఉన్న చెట్టు కొట్టి గ్రామంలోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ ఝాన్సీ అడ్డగించడంతో నిలిచిపోయింది. ఈ సమస్య మండల స్థాయి ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లింది. చాటింపు జరిగిన పండగను ఆపకూడదని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. అడ్డుకున్నది వైసిపి నేతలు కావడంతో వారి వెనుక ఉండకపోతే జగనన్న ఇళ్ల రద్దుచేస్తామని బెదిరిస్తున్నారని పలువురు చెప్పడం కొసమెరుపు.

జంగం జోషికి నేషనల్ అవార్డు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన ఆర్ఎంపి జోనల్ అధ్యక్షులు జంగం జోషి పబ్లిక్ హెల్త్ కేర్ కౌన్సిల్ నేషనల్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన పబ్లిక్ హెల్త్ కేర్ నేషనల్ హెల్త్ అవార్డుల వార్షికోత్సవంలో ప్రముఖుల ద్వారా అవార్డు అందుకున్నారు. మోడ్రన్ మెడిసిన్‌కు ప్రత్యామ్నాయంగా మందులు ఉపయోగించకుండా చిన్న చిన్న వ్యాధులను న్యాయం చేసుకునే విధానాన్ని ప్రజలకు జంగం జోషి అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణ, నారాయణరావు, వరలక్ష్మి, కృష్ణ, సుగుణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

10న వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత విశేషాలు' అంశంపై ఏప్రిల్ 10న భీమిలిలోని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో తెలుగు, హిందీ భాషల్లో వ్యాసరచన, అంబేద్కర్, భారత రాజ్యాంగ రచనలో వహించిన పాత్ర అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు తెలిపారు. 10వ తేదీన సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు వ్యాసరచన, అనంతరం వక్తృత్వ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

'అల్లు' బర్త్ డే సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- ఆనందపురం : అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా రామవరం అల్లు అర్జున్ ఫ్యాన్స్ సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైజాగ్ ఆర్టీసీ కాంప్లెక్స్, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వృద్ధులకు, యాచకులకు, జివిఎంసి కార్మికులకు 150 అల్పాహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామవరం అల్లు అర్జున్ ఫ్యాన్స్ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా అల్లు అర్జున్ పుట్టిన రోజు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.రామ్మోహనరావు, రాజు, నర్సింగు, వెంకటేష్, అరుణ, నాయుడు, పండు, కృష్ణ పాల్గొన్నారు.

శొంఠ్యాంలో ఫ్యామిలీ డాక్టర్

వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ షేక్‌షాహనజ్

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్.షాహనజ్ సాధియా ఆధ్వర్యాన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సుమారు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలింతలు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారికి పరీక్షలు జరిపారు. గర్భిణీ స్త్రీలకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తదుపరి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారు తీసుకుంటున్న చికిత్స, వాడుతున్న మందులు వివరాలడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ, పాఠశాలలను సందర్శించి పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ లెంక లావణ్యరాంబాబు మాట్లాడుతూ, పల్లె ప్రజలకు వైద్యం చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గొంతిని సామినాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు టి.కల్యాణమ్మ, పి.సన్యాసిరావు, సిహెచ్ఒ ఇందు, ఆరోగ్య కార్యకర్తలు గొర్లె సత్యవతి, జి.రమేష్, డిఇఒ జ్ఞానేశ్వరరావు, ఆశ కార్యకర్తలు అన్నపూర్ణ, బొద్దపు శివశంకరి, ఉల్లి భారతి పైలెట్ తాతబాబు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి తగరపువలస : స్థానిక శ్రీ ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. స్థానికంగా జరిగిన సమావేశంలో అధ్యక్షునిగా పెంటపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా నూలు గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా చింతల సురేష్, సహాయ కార్యదర్శిగా బల్ల శ్రీను, కోశాధికారిగా కానూరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయబోమని స్పష్టం చేశారు. టైలర్ల సంక్షేమంతో పాటు సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వర్క్‌షాపులో పాల్గొన్న ద్వారం త్యాగరాజు, మండపాక శారద

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాపు

ప్రజాశక్తి-సీతమ్మధార : విమల కృష్ణ మ్యూజిక్ అకాడమి చైర్మన్ డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యాన స్థానిక పౌరగ్రంథాలయంలో శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్ షాప్ ప్రారంభమైంది. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ద్వారం త్యాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన తండ్రి, ప్రముఖ సంగీత విద్వాంసులు అయిన ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ, ఆదివారం కూడా వర్క్ షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంగీత కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : నట రత్న కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో 'తారలెంతగా మెరిసేనో..' శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి రస హృదయాలను కట్టి పడేసింది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎస్.ఫణిస్వామి జ్యోతి వెలిగించి విభావరిని ప్రారంభించారు. అనంతరం గాయకులు పాటలు పాడారు. భయ్యా శ్రీనివాస్, సాత్విక పాడిన అబ్బ ముసురేసింది, రాము, లయ పాడిన నీవులేక నేనులేను, అభినయ్, శైలజ పాడిన అందం హిందోళం, అమ్మాజీరావు, రేణుక పాడిన నా మది నిన్ను పిలిచింది, మహ్మద్ ఖాన్, గీత పాడిన చినుకు చినుకు అందెలతో, సుధీర్, శైలు పాడిన ఇందిరమందిర సుందర, సూర్య ప్రభ పాడిన ఇది మల్లెల వేళయనీ వంటి గీతాలు ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాయి. సంస్థ అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్, సోషల్ మీడియా స్టేట్ అధ్యక్షులు సన్ మూర్తి, కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ప్రతినిధులు వెంకటేష్ మాస్టర్, ఎంవిర్ నాగేశ్వరరావు, చింతా ప్రభాకర్, ఛాయా గ్రాహకుడు బుర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 27,318 మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి తృతీయ భాషా పరీక్షకు 27,426 మంది హాజరు కావల్సి ఉండగా 27,318 మంది హాజరయ్యారు. 108 మంది గైర్హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్ ఎం.జ్యోతి కుమారి 3 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ 8 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 35 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డిఇఒ చంద్రకళ తెలిపారు.

జాతీయ జంతు ప్రదర్శనశాల ప్రేమికుల దినోత్సవంలో విద్యార్థులు

ఘనంగా జాతీయ జూ ప్రేమికుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో శనివారం జాతీయ జంతు ప్రదర్శనశాల ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 4 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూ టేల్స్ సీతా శ్రీనివాస్ పాల్గొన్నారు. జూలోని జంతువులు వాటి ప్రవర్తనపై ఆసక్తికరమైన కథలను పిల్లలకు వివరించారు. చిన్న చిన్న పిట్ట కథలకు పిల్లలు ఆకర్షితులయ్యారు. పులులు, సింహాలు, కోతులు తదితర జంతువుల అలవాట్లను వివరించారు. సీతాకోక చిలుక జీవిత చరిత్ర, పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు అవగాహన కల్పించారు. పర్యావరణంపై కాలుష్య ప్రభావం, జాగ్రత్తలను ఎసిఎఫ్ మంగమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, అటవీశాఖాధికారులు భారతి, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా బొట్టా నర్సింగరావు వర్ధంతి

గోపాలపట్నంలో నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు, వెంకటరెడ్డి తదితరులు

అక్కయ్యపాలెం జోన్‌లో...

ప్రజాశక్తి -యంత్రాంగం

సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నాయకులు, ప్రజా సేవకులు కీర్తిశేషులు బొట్టా నర్సింగరావు వర్ధంతిని శనివారం జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో బొట్టా నరసింగరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఎస్.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, బొట్టా నర్సింగరావు తుది శ్వాసవరకూ పేదలు, కష్టజీవులు, కార్మికుల సమస్యలపై పోరాడారని కొనియాడారు. తోపుడుబండ్ల కార్మికులకు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు యూనియన్లు పెట్టించి, వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. కార్పొరేటర్‌గా 36వ వార్డు సమస్యలపైనే కాకుండా నగరవ్యాప్తంగా ఉన్న సమస్యలన్నింటిపైనా కౌన్సిల్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషిచేసేవారని తెలిపారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని కొనియాడారు. బొట్టా నర్సింగరావు సోషలిజం రావాలని కోరుకున్నారని తెలిపారు. ఆ ఆశయం కోసమే పని చేశారని, మతతత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పి ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న పాలకులకు సరైన బుద్ధి చెప్పినప్పుడే నర్సింగరావుకు ఇచ్చిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, జోన్ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు బి.సింహాచలం, ఒ.అప్పారావు, నాయకులు పి.రామారావు, జి.సూర్యచంద్రరావు, ఎస్.సుధాకర్, ఆర్ఎస్ఎన్, శ్రావణ్, ఒ.విజయ, ఎం.ఈశ్వరరావు, ఎ.పుష్ప, సుమిత్ర, నాయుడుబాబు పాల్గొన్నారు.

1000 మందికి మజ్జిగ పంపిణీ

బిఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన కంచరపాలెం జాతీయ రహదానిలో గల బిఎన్ఆర్ భవనం వద్ద శనివారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, కంచరపాలెం ప్రాంతంలో ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ నా సమాజం బాగుండాలని ఆశించిన వ్యక్తి బొట్ట నర్సింగరావు అని కొనియాడారు. సమాజంలో పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలు, మత విద్వేషాలు మానవ సమాజానికి మంచివి కావని మిత్రులకు చెబుతుండేవారని పేర్కొన్నారు. ఆయన చిన్న వయసులోనే కేన్సర్ వ్యాధితో మరణించడం బాధాకరమన్నారు. ఆయన జ్ఞాపకార్థం కంచరపాలెంలో బిఎన్ఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఆర్ ట్రస్టీ కొయ్యి వెంకట అప్పారావు, లెక్చరర్ రాజేష్, ప్రతాప్, రోషన్, శ్రీను, లెక్చరర్ సతీష్, శివ, ఈశ్వరరావు, సూర్యచంద్రరావు, కంప్యూటర్ ఫ్యాకల్టీ ప్రభాకర్, సింహాచలం, బుజ్జి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక సిఐటియు కార్యాలయంలో బొట్టా నరసింగరావు చిత్ర పటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్.మూర్తి, రవ్వ నరసింగరావు, డి.బాబాజీ, పలువురు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతంపేట, దొండపర్తి, డైమండ్ పార్క్, శంకరమఠం, ఆర్‌కె.నగర్, చిట్టిబాబు కాలనీలలో సిఐటియు ఆధ్వర్యాన బొట్టా నర్సింగరావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి ప్రకాశరావు, నాయకులు ఈశ్వరరావు, చంటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాదిలోని సిఐటియు కార్యాలయంలో బిఎన్ఆర్ చిత్ర పటానికి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, సిఐటియులో నాయకునిగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడమే కాకుండా, గొప్ప నాయకత్వాన్ని తయారు చేసిన నాయకుడు బొట్టా నర్సింగరావు అని కొనియాడారు. క్రమ శిక్షణ గల నాయకునిగా ఎదిగారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. బిఎన్ఆర్ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, పి.రాజు, కె.నాగరాజు, కుమార్, జివిజయ్, కె.కొండమ్మ, ఎ.గురుమూర్తిరెడ్డి, బి.నర్సింగరావు, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, ఎం ఆదిలక్ష్మి, కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, 62వ వార్డు పరిధి దుర్గానగర్, 63వ వార్డులలో బొట్టా నర్సింగరావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. 59వ వార్డు నెహ్రూనగర్‌లో బొట్టా నర్సింగరావు చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నర్సింగరావు మల్కాపురం ఆంధ్ర స్టీల్ కంపెనీలో పనిచేసేవారని, అప్పట్లో సిఐటియు ఏర్పాటుచేసి కార్మికులకు అండగా అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. కంచరపాలెంలో తోపుడు బళ్ళు సంఘాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. కంచరపాలెంలో స్థానిక సమస్యలపై పోరాడారని చెప్పారు. ప్రజలు అతన్ని రెండు సార్లు కార్పోరేటర్‌గా గెలిపించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనలో అంతా నడవాలని పిలుపునిచ్చారు. 63వ వార్డు క్రాంతినగర్‌లో గంటా సత్యనారాయణ, 62వ వార్డు దుర్గానగర్‌లో బి.అర్జునరావు, ఎఎస్ఆర్.కాలనీలో ఎల్.కృష్ణ పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఆయా కార్యక్రమంలో సిపిఎం మల్కాపురంజోన్ కార్యదర్శి పి.పైడిరాజు, జోన్ నాయుకులు ఆర్.లక్ష్మణమూర్తి, విమల, పివి.భాస్కర్, పి.సురేష్, జె.రామునాయుడు, డివైఎఫ్ఐ జోన్ అధ్యక్షులు బి.శ్రీను, సుభానీ, రాజు, వెంకటేష్, నాని, ప్రజానాట్యమండలి నాయుకులు వై.గంగాధర్, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం సిఐటియు కార్యాలయంలో నర్సింగరావు చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిపిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజు, గోపాలపట్నం జోన్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువు, బిఎన్ఆర్.నగర్‌లో సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన బొట్టా నర్సింగరావు వర్ధంతిని నిర్వహించారు. నర్సింగరావు చిత్రపటానికి విసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఎం నగర కమిటీ సభ్యులు కోరెడ్ల రమాప్రభ పూలమాల వేసి నివాళులర్పించారు. బొట్టా నర్సింగరావు ఆశయ సాధన కోసం కృషి చేయాలని రమాప్రభ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.కృష్ణమూర్తి, ఐద్వా నాయకులు ఎస్.గౌరమ్మ, సిఐటియు ఆరిలోవ సెక్రటరీ రమణ, వై.అప్పారావు, బిఎన్ఆర్ నగర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక సిఐటియు కార్యాలయంలో బొట్టా నర్సింగరావు వర్ధంతిని నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు బిటి.మూర్తి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పోరాటంలో ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. తోపుడుబండ్ల కార్మికుల సంఘం ఏర్పాటుచేసి వారి శ్రేయస్సు కోసం పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జిఎస్.సూర్యప్రకాశరావు, అప్పారావు, బి.ప్రకాష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ఆర్ భవనం వద్ద మజ్జిగ పంపిణీ

పెందుర్తిలో నివాళులర్పిస్తున్న బిటి.మూర్తి తదితరులు

కొమ్మాదిలో నివాళులర్పిస్తున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

ఆరిలోవలో రమాప్రభ తదితరులు

తగరపువలసలో నివాళులర్పిస్తున్న మూర్తి తదితరులు

నెహ్రూనగర్‌లో పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

రుషిల్ డెకార్ యాజమాన్యం వైఖరి సరికాదు

◆ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము

◆ నాలుగో రోజు కొనసాగిన ముఠా కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ముఠా కార్మికులు సమస్యలను పట్టించుకోకుండా రుషిల్ డెకార్ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము అన్నారు. దిబ్బపాలెం గ్రామానికి చెందిన 100 మంది ముఠా కార్మికులు రుషిల్ డెకార్ ఫ్లై వుడ్ పరిశ్రమ వద్ద చేపట్టిన ఆందోళన శనివారం నాటికి నాలుగో రోజుకు చేరింది. 2019 ఒప్పందం ప్రకారం ముఠా కార్మికులకు చెల్లింపులు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము సంపూర్ణమైన మద్దతు తెలియజేసి మాట్లాడారు. ముఠా కార్మికులకు పాత పద్ధతిలోనే కూలి రేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు భూములిస్తే మీ జీవితాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నాడు చెప్పిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు ముఠా కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాజమాన్యంతో చేతులు కలిపి నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఏపిఐఐసి అధికారులు, కలెక్టర్ స్పందించి ముఠా కార్మికులకు న్యాయం చేయాలని రాము డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సత్యనారాయణ, గొర్లి సత్తిబాబు, గొర్ల ఇరికినాయుడు, అంది అప్పలనాయుడు, గుర్రం సూరిబాబు, బయలుపూడి రమణ, సిహెచ్ వెంకన్న, వి నానాజీ, క్రి కొండబాబు, నిర్వాసిత ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న రసూల్ డెకర్ ప్లైవుడ్ కంపెనీ ముఠా కార్మికులు

గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం

గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చాయని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం మండలంలోని అడ్డూరు గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావలసిన సేవలన్నీ సచివాలయం ద్వారా అందడంతో పాటు నేరుగా ఇంటికే వచ్చి వాలంటీర్లు సమాచారాన్ని చేరవేస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటి వద్ద స్టిక్కర్ అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు వైసిపి నాయకులు సిమ్మి నాయుడు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

అడ్డూరు గ్రామంలో టిడిపి మాజీ వైస్ ప్రెసిడెంట్ బోయిన చిన్నం నాయుడు, చుక్క శ్రీను, మామిడి లోవ, ఎస్.దేవుడు బాబు, ఎలమంచిలి సోమేష్, చుక్క బాబూజీ, చుక్క వెంకట్రావు ఆధ్వర్యాన 20 కుటుంబాల వారు టిడిపి నుంచి వైసిపిలో సుమారుగా శనివారం చేరారు. వారికి స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను అనకాపల్లి మండలం వెంకుపాలెం దయా చిల్డ్రన్స్ హోమ్ చిన్నపిల్లల ఆశ్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్, స్టంట్ మాస్టర్ బద్రి టీం సభ్యులు, గొంతిన శివ శంకర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హోంలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారం రోజులు నుంచి అనకాపల్లి నియోజకవర్గంలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అనంతరం 100మంది ఆశ్రమంలో వున్న పిల్లలకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్టంట్ మాస్టర్ బద్రి టీం సభ్యులు, కుమార్, గంగాధర్, సత్తిబాబు, అనకాపల్లి నియోజకవర్గం అల్లు అర్జున్ ఫ్యాన్స్ సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్ పిల్లలకు భోజనాలు పెడుతున్న దృశ్యం

అగ్ని ప్రమాదంలో కోళ్ల ఫారం షెడ్ దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- అనకాపల్లి జిల్లా

మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో కోళ్ల ఫారం షెడ్ అగ్నికి కాలి బూడిదైంది. బాధితుని కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కోళ్ల ఫారం రైతు గోకాడ ప్రసాద్‌కి చెందిన కోళ్ల ఫారం షెడ్డుకు అనుకొని ఉన్న తన తాటి పెండి వద్ద చెత్త చెదారానికి శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టాడు. గాలికి ఆ అగ్ని మంటలు వ్యాపించి పక్కనే ఉన్న కోళ్ల ఫారం షెడ్డుకు అంటుకున్నాయి. వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది శకటంతో హుటాహుటిని వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే షెడ్ కాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర నష్టం జరిగిందని రైతు ప్రసాద్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం

డిప్యూటీ సిఎం పరామర్శ

కోళ్ల ఫారం రైతు గోకాడ ప్రసాద్ కోళ్ల ఫారం షెడ్డు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన సమాచారం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారిని ఓదార్చారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కోళ్ల ఫారం షెడ్

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి-రాంబిల్లి

అచ్యుతాపురం సెజ్‌లో గల వసుధ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం ప్రమాదం చోటుచేసుకొని మృతి చెందిన తిరుమల రాజు వెంకట సుబ్బరాజు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో నిరంతరం ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పోతున్నా పరిశ్రమ యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొన్నారు. పరిశ్రమలు, కార్మికుల భద్రతపై తనిఖీలు చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఫలితంగా ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారుల హడావుడి తప్ప భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి నివేదికలు బయటపెట్టాలని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలుడి వైద్యం ఖర్చులు ఎంతైనా భరిస్తాం

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామంలోని వికలాంగ బాలుడికి అయ్యే వైద్య ఖర్చులను ఎంతైనా ప్రభుత్వం భరిస్తుందని రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం ఆయన గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఒక టిఫిన్ కొట్టు వద్ద ఆయన ఆగి, దాని నిర్వాహకులను పలకరించారు. ఎనిమిది సంవత్సరాలుగా వికలాంగు బాలుడు చేతన్ ప్రవీణ్ పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు సంవత్సరాల నుంచి కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయని, కూర్చున్న చోట నుంచి లేవలేడని, వైద్యం చేయించడానికి విశాఖ, హైదరాబాదులో డాక్టర్ల దగ్గరికి తీసుకెళ్తే వివిధ పరీక్షల నిర్వహించి ఈ వ్యాధికి చికిత్స లేదని డాక్టర్లు చేతులెత్తేశారని చేతన్ తండ్రి రాము తెలిపారు. శరీరంలోని మల్టీపుల్ జీన్స్ దెబ్బతిన్నాయని, కొద్ది నెలల కిందట చేతన్‌ను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చూపించగా, ఆర్ జీన్స్ దెబ్బతిన్నాయని, ఒక్కో జీన్ నయం చేయడానికి రూ.25 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని రాము వివరించారు. బాలుని పరిస్థితిని చూసి మంత్రి అమర్నాథ్ వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించి ముందుగా ఒక జీన్ నయం చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో వివరాలు తీసుకు రమ్మని కోరారు. దీనికి అయ్యే ఖర్చు ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తదుపరి వైద్యానికి కూడా ఆర్థిక సహాయం అందేలా చేస్తానని, అవసరమైతే ముఖ్యమంత్రి దగ్గరికి తీసుకువెళ్లి చేతన్ వ్యాధి నయం చేయించడానికి చర్యలు తీసుకుంటామని అమర్నాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లె సూరిబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

నేడు బ్రాండిక్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి అచ్యుతాపురం : బ్రాండిక్స్ సిటీ ఆవరణలో ఆదివారం బ్రాండిక్స్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం చేపడుతున్నట్లు బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి తెలిపారు. బ్రాండిక్స్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే 103 కంటి వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఆదివారం కంటి వైద్య శిబిరంతో పాటు రెడ్ క్రాస్ సొసైటీ సహాయ సహకారాలతో రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరు రక్తదానం కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చని తెలిపారు. రక్తదానం ప్రాణదానం వంటిదని పేర్కొన్నారు.

హరిపాలెంలో వైద్య శిబిరం

విష్ణు డెంటల్ హాస్పిటల్, సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరిపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు అడిగర్ల సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరానికి వచ్చి వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

'మిషన్ వాత్సల్య'పై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో అమలు కానున్న మిషన్ వాత్సల్య పథకంపై అనకాపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. మిషన్ వాత్సల్య దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.4 వేలు అందజేస్తారని తెలిపారు. తల్లి గాని, తండ్రి గాని లేని విద్యార్థులు అన్ని ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా అనకాపల్లిని అభివృద్ధి చేస్తున్న గుడివాడ అమర్నాథ్‌కు అండగా నిలుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పలక సత్యనారాయణ, మున్నూరు శ్రీనివాసరావు, ఉగ్గిన శ్రీనివాసరావు, పలకా వాసు, దాడి గణేష్, పల్లా శ్రీనివాసరావు, సింగంపల్లి నాగరాజు, గుండా రమేష్ గుప్తా, పొలమరశెట్టి మోహన్, డొంక సత్తిబాబు, పేలూరి కళ్యాణ్, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

కామాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - అనకాపల్లి

స్థానిక గవరపాలెంలోని శ్రీకామాక్షి దేవి ఆలయంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు నాగులకొండ సూర్య అచారి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ వెంకట సత్య నరసింహాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

శ్రీసత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో మండలంలోని కె.సంతపాలెంలో శనివారం రామాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గ్రామంలో ఐదుగురు గర్భిణులకు సత్యసాయి భజన మండలికి చెందిన మహిళా భక్తులు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సంస్థల జిల్లా సేవాదళ్ సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, భజన మండళ్ల మండల ఇన్‌ఛార్జి కన్నూరు అప్పలనాయుడు, కె.కోటపాడు సమితి కన్వీనరు బండారు నారాయణపాత్రుడు, బాలవికాస్ గురువు సర్వశుద్ధి మాధురి, సాయి భక్తులు కశిరెడ్డి సన్యాశినాయుడు, కశిరెడ్డి నాగమయ్య, వెన్నల లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్త పి.భవానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీమంతాలు చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

బయోమెట్రిక్‌తో జీతభత్యాలు ముడి

- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలతో సతమతం

- ఫీల్డ్‌లో ఉన్నప్పుడు సాధ్యం కావడం లేదంటున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - యలమంచిలి

సచివాలయ ఉద్యోగులంతా రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలని, లేదంటే జీతాల్లో కోత విధించాలని కొత్త మార్గ దర్శకాలు వెలువడడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు సాంకేతిక పరమైన సమస్యలు వెంటాడుతుండగా, మరో వైపు ఫీల్డ్‌కి వెళ్లినప్పుడు బయో మెట్రిక్ వేయడం సాధ్యం కావడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు.

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుండి 3 గంటల మధ్య, సాయంత్రం 5.30 గంటలకు ఇలా మూడు సార్లు ముఖ ఆధారిత/ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి వేయాలని ఈ ఏడాది మార్చి 30న మార్గదర్శకాలు జారీ అయ్యాయి. హాజరు పడని రోజులకే వేతనం ఇవ్వాలని, లేదంటే కోత విధించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 22 వరకు హాజరు పరిశీలించి సెలవు రోజులు పోను పనిదినాలకు తగ్గ వేతనాలు ఏప్రిల్‌లో చెల్లించాలని

యలమంచిలి పట్టణంలోని ఎంఎస్ఆర్ కాలనీ వార్డు సచివాలయం

ఆదేశాలు రాగా, యలమంచిలి పరిధిలో డిడిఓలు ఉన్న మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒ, సచివాలయ ఉద్యోగుల హాజరుతో వేతనం ముడిపెట్టి జీతాల బిల్లులు తయారు చేశారు. హాజరు పడని రోజులకు జీతం కోత విధించినట్లు తెలిసింది.

జీత భత్యాలకు హాజరుకు ముడిపెట్టడంపై ఉద్యోగులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో 13 సచివాలయాల్లో 106 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సచివాలయాల ద్వారా 50 రకాల పౌరసేవలు అందిస్తున్నారు. ఆస్తిపన్ను, ఇంటిపన్నులతో పాటు ఇతర రకాల పనులను కూడా సచివాలయ సిబ్బందికే అప్పగించారు. జగనన్న ఇంటి నిర్మాణాల పర్యవేక్షణ సైతం సచివాలయ ప్లానింగ్ సిబ్బంది చూస్తున్నారు. పట్టణాలకు దూరంగా లే అవుట్లు ఉండడంతో అక్కడకు ఉదయమే వెళ్లాలంటే బయోమెట్రిక్ అడ్డంకిగా మారిందని ఉద్యోగులు చెబుతున్నారు. నిత్యం మూడు సార్లు హాజరు వేసే పద్ధతి నుండి మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పరమైన సాంకేతిక సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. అలాంటి సమయాల్లో ఉద్యోగులు హాజరు వేయలేరు. దీంతో సచివాలయ ఉద్యోగులంతా ఈ కొత్త మార్గదర్శకాల పట్ల బెంబేలెత్తుతున్నారు.

ఇంకా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు

ఆదేశాలు పూర్తి స్థాయిలో ఇంకా అమలు చేయడం లేదు. రోజుకు మూడు సార్లు హాజరులో కనీసం ఒకసారి హాజరు వేసినా ఉద్యోగి పనిదినంగానే పరిగణిస్తున్నాం. సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు ఆ సంగతి ఆన్‌లైన్‌లో నాకు తెలియజేస్తే నా సైట్ ద్వారా హాజరు వేసే అవకాశం ఉంది. హాజరు పడని ఉద్యోగులకు జీతాల్లో కోత విధించడం తప్పదు. ఫీల్డు స్టాఫ్ ఉదయం ఆరేడు గంటలకే సచివాలయానికి వెళ్లి హాజరు వేయవచ్చు.

- కృష్ణవేణి, యలమంచిలి మున్సిపల్ కమిషనర్

ముఖ్యమంత్రిపై వైసిపి నాయకులకు నమ్మకం లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, తుదకు సలహాదారులతో అందరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై నమ్మకం పోయిందని, ఆ విషయం తేటతెల్లమైన తర్వాతే నన్ను నమ్మండి అని బ్రతిమలాడుకుంటురని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఎద్దేవా చేశారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గంగవరం పోర్టును రూ.646 కోట్లకు ఎందుకు అమ్మేశారో పరిశ్రమల మంత్రి అమర్నాథ్ ప్రజలకు జవాబు చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసినా ఉత్తరాంధ్ర మంత్రులు నోరు మెదపకుండా, చంద్రబాబు పేరు చెప్పుకొని బతికేస్తున్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల కోసం నిధులు అడిగే దమ్ము ధైర్యము మంత్రులకు ఉందా? అని ప్రశ్నించారు. గత నాలుగు సంవత్సరాలుగా బట్టన్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు

నొక్కడం అప్పులు తేవడం, పత్రికా ప్రకటనలకు, ప్రైవేటు ఫ్లైట్లకు వేల కోట్లు చెల్లించడం చేశారన్నారు. అరకొరగా ఉన్న జీవీఎంసీ నిధులు 125 కోట్లను అభివృద్ధి పేరుతో జి20 సమావేశాలకు ఖర్చు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఇవ్వవలసిన నిధులు ఇవ్వకుండా జీవీఎంసీని దివాలా తీయిస్తున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు నడిపల్లి గణేశ్వరరావు, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు, కొట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

సింహాచలం నాయుడు మృతి కేసును సిబిసిఐడికి అప్పగించాలి

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

బాధిత కుటుంబ సభ్యులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతున్న వెంకన్న

ప్రజాశక్తి- అనకాపల్లి జిల్లా

దేవరాపల్లి మండల కేంద్రానికి చెందిన జామి సింహాచలం నాయుడు అనుమానాస్పద మృతి కేసును మొదటి నుంచి అనుమానం కలిగించే విధంగా దర్యాప్తు జరుగుతుందని, అందువల్ల దీనిని సిబిసిఐడికి అప్పగించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం రైవాడ అతిథి గృహం వద్ద మృతుని కుటుంబ సభ్యులతో కలిసి వెంకన్న విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సింహాచలం నాయుడు మృతికి కారకులు ఎవరో, అనుమానితుడు ఎక్కడ రెక్కీ నిర్వహించాడో ఇప్పటికే అనేక మంది పూసగుచ్చినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చారని, అయినా ఎవరి దగ్గరైనా సాక్ష్యాలు ఉంటే తీసుకురమ్మని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉన్నాయన్నారు. నాయుడు మృతికి ప్రేరేపించిన వ్యక్తులపై కేసు పెట్టడానికి అవకాశం ఉన్నా పోలీసులు ఉదారంగా వ్యవహరించి కేసు నుండి తప్పించడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పోస్టుమార్టం ప్రాథమిక రిపోర్టులో చిన్న పేగులో విషం ఉన్నట్లు, చాతి ఎడమ వైపు ఎవరో అమ్ము అని పేరుతో పచ్చబొట్టు ఉన్నట్లు ఉందని, పూర్తిస్థాయిలో పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కేసు విషయం 25 మంది స్టేట్‌మెంట్లు కట్టామని, ఇంకా ఎవరైనా ప్రత్యక్షంగా చూసినవారు ఉంటే స్టేట్మెంట్ తీసుకుంటామని పోలీసులు చెప్పడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. ఆ తల్లి ఇంకా సాక్షులను ఎక్కడినుండి తీసుకురాగలదని వెంకన్న ప్రశ్నించారు. త్వరలో మృతిని తల్లి సింహాచలమ్మ పోలీస్ స్టేషన్ ముందు నిరాహారదీక్ష చేసుకోవడానికి అనుమతి కోరుతుందని, పోలీసులు అనుమతి ఇచ్చిన వెంటనే సింహాచలమ్మ మద్దతుగా దేవరాపల్లి ప్రజలు నిరాహార దీక్షలో పాల్గొంటారని తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ప్రజానీకం, ప్రజాసంఘాలు, సంయుక్తంగా పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవిరెడ్డి దేముడు నాయుడు (సింహ), బండారు అప్పలనాయుడు, కడారి రామకృష్ణ, జామి శ్రీను, చొక్కాకుల సన్యాసినాయుడు, చొక్కాకుల సింహాద్రి, పాచిల వెంకటరావు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'

నర్సీపట్నంలో ప్రచారం చేస్తున్న ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పథకాలపై వైసిపి నాయకులు ప్రచారం చేశారు.

నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ శారదానగర్ 16వ వార్డు, బలిఘట్టంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. బలిఘట్టంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి, శారద నగర్‌లో కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ, మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను పొందుతున్న వారంతా సీఎం జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌ను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు మీసాల సత్యనారాయణ. ఏఎంసీ శ్రీను, వాలంటీర్ ఇందుర్తి మణి, వార్డు గృహ సారధులు పత్తికొండ హైమావతి, గెడ్డం శ్రీనివాస్, పులిగా సత్యారావు, వబ్బలరెడ్డి వెంకటేశ్వర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని గొలుగొండ, రావణాపల్లి తదితర పంచాయతీల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం గృహసారధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, గృహసారధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆనందపురం : లొడగలవానిపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ లొడగల రమణ ఆధ్వర్యాన నిర్వహించారు. గ్రామంలో గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఆనందపురం మండల ప్రెసిడెంట్ బంక సత్యం, ఎంపిటిసి సభ్యులు రౌతు శ్యామల వెంకట్రావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పాండ్రంకి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవీఎంసీ 44వ వార్డులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న నేతలు

గొలుగొండలో..

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక రుత్తల ఫంక్షన్ హాలులో గిరిజన ఉద్యోగుల సంఘం నర్సీపట్నం రూరల్ కు సంబంధించి కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎస్.ధనార్జన్, ప్రధాన కార్యదర్శులుగా జె.సింహాచలం. ఎస్.ధర్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జానకాని కృష్ణయ్య, కూడా లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పంతులు బాబు, ఎస్. కోటిబాబు, కోశాధికారిగా ఎస్.భరత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా కె.నాగమణి, ఎస్.శ్రావణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా అచ్చియమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికార్లుగా పోతురాజు, నారాయణరావు, అప్పారావు, సోమయ్య, రామారావు, సత్యనారాయణలు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

పరికరాలు ఇస్తున్న మేనేజర్ వరప్రసాద్

వైద్య పరికరాల వితరణ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శనివారం హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన రూ.8.20 లక్షల విలువగల వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ పల్లా వరప్రసాద్ మాట్లాడుతూ, హెల్త్ సెంటర్కు ఉపయోగపడే ఈసీజీ, సిటిజీ, హైడ్రాలిక్ ఆపరేషన్ టేబుల్ సహా పలు పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజలక్ష్మి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

గొలుగొండలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి-గొలుగొండ:సమస్త మానవాళి పాప పరిహారం కోసం జీసెస్ చేసిన త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రై డే అని ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహించారు. కేడీపేట నుండి ప్రారంభమైన ర్యాలీ ప్రార్ధన గీతాలు ఆలపిస్తూ పాతూరు వరకు జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, మానవుల రక్షణ కోసమే యేసుక్రీస్తు మరణించారన్నారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో క్రైస్తవులు, పెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక సిబిఎం కాంపౌండ్ నుండి సి ఎంఆర్ సెంటర్ వరకు క్రైస్తవులు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. ప్రపంచానికి శాంతి, ప్రేమ, కరుణ, దయలను యేసుక్రీస్తును అందించారని పాస్టర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో . పాస్టర్లు ప్రమోద్ కుమార్, ప్రేమ్ కుమార్, సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ట్రెజరర్ దేవానంద్, అర్జున్‌రావు పాస్టర్ ఫెలోషిప్ పాస్టర్లు, పెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో చేపడుతున్న ర్యాలీ

'తాండవ' లీకేజీలతో సాగునీరు వృథా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తాండవ రిజర్వాయర్ మెయిన్ గేట్ల లీకేజీలతో సాగునీరు వృథాగా పోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. శనివారం పార్టీ నాయకులతో స్థానిక లియో గ్రాండ్ కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లీకేజీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టకుంటే రానున్న ఖరీఫ్ సీజన్లో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. నీరు విడుదల నిలిపి వేసినప్పటికీ మెయిన్ గేట్ల ద్వారా లీకేజీలతో కుడి, ఎడమ కాలువలకు పోతుందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి శ్రీను, వాసం వెంకటేష్, గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, నాయకులు మురళి, కర్రి సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కోటవురట్ల:విజయవాడలో ఈనెల 16న నిర్వహించనున్న సామాజిక విప్లవ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పైల రమేష్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కుల నిర్మూలన కోసం అంతా కలిసి పని చేయాలని సందర్భంగా పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సెల్ నాయకులు, జై భారత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ అప్డేట్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:ఆధార్ అప్డేట్ చేయించుకోవాలని కొడవటిపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ కోసూరు అప్పారావు, వీఆర్వో నర్సింగరావు అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలు ఆధార్ అప్డేట్ విషయమై నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

ఎస్ఐ ఉపేంద్ర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: కేడీపేట ఎస్సైగా ఉపేంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సై బాధ్యతలు నిర్వహించిన సూర్యనారాయణ చోడవరంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేంద్ర మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

రూ.30 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చింపేటలో రెండు రామాలయాలకు, శివాలయం వద్ద కళ్యాణ మండపానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో టిటిడి నుంచి రూ.30లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ ఉలబాల చంద్ర తెలిపారు. ఎస్సీ, బిసి కాలనీల్లో రామాలయం నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున మినీ కైలాసగిరి వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించారన్నారు. త్వరలో వీటి నిర్మాణాలు చేపడతామన్నారు. నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ధర్మశ్రీకి సర్పంచ్‌తో పాటు ఎంపిటిసి సత్యవతి, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మాడుగుల:అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి తెలిపారు. మండలంలోని గరికబందలో అంగన్వాడీ కార్యకర్తతో పాటు, ఆయా, మాడుగుల గడబూరులో ఆయా, చీడికాడ మండలం ఖండివరం 2 కేంద్రంలో ఆయా పోస్ట్ నిమిత్తం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అభ్యర్థుల వయస్సు జూలై 1, 2022 నాటికి 21 సంవత్సరాలు కలిగి, 35 సంవత్సరాలకు మించరాదని తెలిపారు. ఈనెల 10 నుండి 17వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 491వ రోజుకు చేరింది. శనివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా 490 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ,ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమస్య పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి, పిక్కి రమణ, వాసపల్లి నూకరాజు, బొంది నూకరాజు, పిక్కి కాశీ, మైలపల్లి నల్ల, పిక్కి సత్తిరాజు, చొడిపల్లి రాజు, వాసపల్లి వెంకటేష్, కారే కోదండరావు, పిక్కి శ్రీను, మైలపల్లి శివ, మైలపల్లి జాను, బైరాగి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

అవార్డ్ స్వీకరిస్తున్న తహశీల్దార్

తహశీల్దార్‌కు అవార్డు

ప్రజాశక్తి-మాడుగుల: ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవ వేడుకలలో మాడుగుల తహశీల్దార్ పీవీ రత్నం అవార్డు పొందిన వెనువెంటనే మరో అవార్డు సొంతం చేసుకున్నారు. భూ రీ సర్వే పనులు, ఇతర సేవలలో మంచి ఫలితాలు రాణిస్తున్న ఆయన మరోసారి జిల్లా కలెక్టర్ రవి పట్నాన్ శెట్టి చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. గత ఏడాది విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి బదిలీపై మాడుగుల తహసిల్దారుగా విధుల్లో చేరిన ఆయన అప్పటి నుండి, వివాదరహితుడిగా పేరు తెచ్చుకొని రెవెన్యూ సేవలు అందించడంలో మన్ననలు పొందారు. ఇటీవల కాలంలో భూ సర్వే విషయంలో సర్వేయర్లు, వీఆర్వోలు ఇతర సిబ్బందికి అనేక సూచనలు జారీ చేస్తూ సక్రమంగా సర్వే పనులు పూర్తి అయ్యేలా సహకరించారు. ఒక సందర్భంలో అల్పాహారం, భోజనాలకు ఇబ్బంది అవుతుందని గమనించి, సమయ జాప్యం జరగకుండా ఆయనే సిబ్బందికి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మరోసారి ఉత్తమ సేవలకు గాను అవార్డు లభించింది. మండలంలోని పలువురు తహసిల్దార్ కు అభినందనలు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

టేకు దుంగలు పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో అనధికారికంగా ట్రాక్టర్‌పై తరలిస్తున్న రూ.80వేల విలువైన టేకు దుంగలను డిఆర్‌ఒ రాజేష్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ రాజేష్ మాట్లాడుతూ, నిందితుడు కొరుప్రోలు శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పరీక్షిస్తున్న వైద్యులు

లింగంపేటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ అన్నారు. మండలంలోని లింగంపేట గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 161 మంది రోగులకు వైద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించారు. 39 మంది రక్తపోటు, 17 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో మంచం బారిన పడిన ముగ్గురు వ్యాధిగ్రస్తులకు, 27 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రం, ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటిని క్లోరినేజేషన్ చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం ఉమా, ఆశ కార్యకర్త అచ్చిపాప, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి-కలెక్టరేట్: పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 736వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మి వేయడం ద్వారా ప్రయోజనం పొందాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల అటు కేంద్ర ప్రభుత్వానికీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికీ ఏటా వేల కోట్ల ఆదాయం లభిస్తోందని వెల్లడించారు. అయినప్పటికీ ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగంలోనే రిజర్వేషన్లు అమలులో ఉంటాయన్నారు. దీక్షల్లో కెవిపి.చంద్రమౌళి, కె.సంతోష్ కుమార్, రామారావు, విజయ, అనిల్ కుమార్, భూలోక పాల్గొన్నారు.

దీక్ష చేపడుతున్న సిఐటియు జగదాంబ జోన్ నాయకులు

ప్రియాంక

ఇషాక్ మహమ్మద్

ఇద్దరు వైద్యుల నియామకం

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి సిహెచ్‌సిలో శనివారం ఇద్దరు వైద్యులు బాధ్యతలు స్వీకరించారు. గైనకాలజిస్ట్ ఎస్.ప్రియాంక, కంటి వైద్య నిపుణులు ఇషాక్ మహమ్మద్‌లు విధుల్లో చేరారు.

మత్స్యకారుల సంక్షేమంపై చర్చ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేశారని, అదే విధంగా మత్స్యకారులను కూడా అదే జాబితాలో చేర్చాలని పలువురు మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, జీవన విధానం' అన్న అంశంపై శనివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. నాయకులు చింతపల్లి సూర్యనారాయణ, చేగోడి రమేష్, మూగి శ్రీనివాసరావు, పుక్కల నాగరాజు, అర్జాల వెంకట రమణ మాట్లాడారు. మత్స్యకారుల జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా 12 ఎమ్మెల్యే సీట్లు, 2 ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు.

వేసవి దుక్కులతో మేలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వేసవి దుక్కులు చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అరుణ్ కుమారి మాట్లాడుతూ, రైతులు వేసవి దుక్కులు చేసుకోవడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వేసవిలో కనీసం రెండు సార్లు దుక్కులు చేసుకోవాలన్నారు. భూమి సారవంతం కావడంతో పాటు క్రిమి కీటకాలు నశిస్తాయని తద్వారా దిగుబడి అధికంగా ఉంటుందన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొమరవోలు గ్రామానికి చెందిన ఈర్లె దేవి తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఒడిశాలో ప్రైవేటు కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తరచూ భార్యభర్తల మధ్య గొడవ జరగడంతోనే ఆమె చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై నాగకార్తీక్ చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ మళ్లీ వస్తే జనం భవిష్యత్తు అంధకారమే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే జనం భవిష్యత్తు అంధకారమేనని బిజెపి రాజ్యసభ ఎంపీ జివిఎల్ నరసింహారావు అన్నారు. శనివారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో అధికారం దిశగా తమ పార్టీ ప్రణాళికలు ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల సొమ్మును ప్రజలకే ఇస్తూ జగనన్నే మా భవిష్యత్తు అనడం సరికాదన్నారు. జగనేమీ దాన వీర శూర కర్ణ కాదని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడిస్తారని అన్నారు. మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డి బిజెపిలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని తెలిపారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

మన్యంలో ఇటుకల పండగ

బడ్డ తాడును లాగుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -పాడేరు: మన్యంలో ఇటుకుల పండుగ సందడి మొదలైంది. మండల కేంద్రంలోని పాత పాడేరులో శనివారం సాయంత్రం ఇటుకుల పండగలో భాగంగా బడ్డ ఉత్సవం నిర్వహించారు. అన్నదమ్ములు వర్సెస్ బావ్మర్దులు మధ్య బలా బలాల పోటీ రసవత్తరంగా సాగింది. ఇరువైపుల వారు గెలుపు కోసం బడ్డ లాగే బల ప్రదర్శన చివరిదాకా ఉత్కంఠగా.. రసవత్తరంగా సాగింది. చివరికి అన్నదమ్ములే గెలుపు సాధించారు. గిరిజనులు నిర్వహించుకునే పండుగలు వారి జీవన విధానాన్ని ప్రతిబింబం చేస్తాయి. ఇటుకుల పండుగలో భాగంగా గ్రామంలో ఆదివారం అక్కాచెల్లెళ్ళు, వదిన మరదళ్ల మధ్య బడ్డ ఉత్సవం జరుగుతుంది.

పెదబయలు రూరల్: మండలంలోని సీతగుంట గ్రామంలో ఇటుకల పండగ ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం గ్రామ పెద్దలు గ్రామ చావడి వద్ద వెదురుతో తయారు చేసిన గొడుగులను పూల మాలలతో అలంకరించి ఇంటింటా ఊరేగించారు. నాలుగు రోడ్ల కూడలిలో గ్రామ దేవత, ఆటవి దేవత లకు తుడుం, డప్పు వాయిద్యాలతో పూజలు నిర్వహించారు. ఆచార ప్రకారం 3 రోజులు పండగను ముగించుకొని ఆదివారం అడవిలోకి యువకులు వేట కు వెళతారు. అటవీ జంతవులను వేటాడి గ్రామ చావడి వద్ద ఇటుకల పండగను ముగిస్తారు.